క్లుప్తంగా

వైభవంగా త్రిమూర్తి శివ జయంతి



త్రిమూర్తి శివజయంతి మహోత్సవంలో నిర్వాహకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయనగరం వీధిలోని ఓంశాంతి భవనంలో ఆదివారం త్రిమూర్తి శివజయంతి మహోత్సవం నిర్వహించారు. శివపరమాత్ముని పతాకాన్ని ఎగురవేసి, జ్యోతి ప్రజ్వలనతో శివలింగాన్ని అలంకరించి ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ఓంశాంతి భవనం నిర్వాహకురాలు బీకే శాంత మాట్లాడుతూ ప్రజాపిత బ్రహకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం స్థాపించి 88 వసంతాలు పూర్తయ్యాయన్నారు. జ్యోతి స్వరూప పరమేశ్వరుడిని త్రికరణ శుద్ధితో స్మరించినప్పుడే సకలపాపాలు హరింపబడతాయని తెలిపారు. సహజ రాజయోగాన్ని ఆచరించడం వలన కుటుంబంలోని సంబంధాలు, బాంధవ్యాలు, సత్సంబంధాలు మరింత బలపడుతాయని పేర్కొన్నారు. కుమారి సుష్మ సంప్రదాయ నృత్యం అందరిని అలరించింది.

ఆస్తిపన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ

బద్వేలు అర్బన్ : ఈ నెల 31వ తేదీ లోపు ఆస్తి, ఖాళీ జాగా పన్ను బకాయిలు ఏక మొత్తంలో చెల్లిస్తే ఆస్తిపన్నుపై ఉన్న వడ్డీ మాఫీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 29న విడుదల చేసిన జీఓ నంబర్ 35 ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరం వరకు ఉన్న బకాయిలపై ఉన్న వడ్డీని, ఈ ఆర్థిక సంవత్సరం పన్నుపై విధించిన వడ్డీని వన్‌టైం మెజర్‌గా మాఫీ చేయడం జరిగిందన్నారు. సంబంధిత యజమానులు ఈ నెల 31వ తేదీ లోపు బకాయిల మొత్తాన్ని చెల్లిస్తే ఈ వడ్డీ మినహాయింపు వర్తిస్తుందని తెలిపారు. పన్ను బకాయిలు మున్సిపల్ కార్యాలయం, ఆయా వార్డు సచివాలయాల్లో చెల్లించవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

6న ఆలయ భూముల కౌలు వేలం

రాజుపాళెం : మండలంలోని పగిడాల గ్రామంలో చెన్నకేశవ, ఈశ్వర, ఆంజనేయస్వామి ఆలయాలకు సంబంధించి భూముల కౌలు వేలం పాట ఈ నెల 6న బుధవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఈఓ రామచంద్రాచార్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరులోని నారాయణరంగయ్యగారి సత్రంలో వేలం పాట నిర్వహిస్తామని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే పాటదారులంతా రూ.10వేల డిపాజిట్ చెల్లించాలని, భూములు దక్కించుకున్న వారంతా మూడేళ్ల పాటు పంటలు పండించుకోవచ్చునని తెలిపారు. ఆసక్తి గల వారంతా వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలని శ్రీశైలానికి పాదయాత్ర



పాదయాత్రతో శ్రీశైలం చేరిన సందీప్‌రెడ్డి బృందం

పోరుమామిళ్ల : వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలని ఆకాంక్షిస్తూ శ్రీశైలానికి యువకులు పాదయాత్రగా వెళ్లారు. పోరుమామిళ్లకు చెందిన అమెరికన్ ఫుట్‌బాల్ కెప్టెన్ పోతిరెడ్డి సందీప్‌రెడ్డి స్నేహితులు ఆత్మకూరు నుంచి 52 కిలోమీటర్లు కాలినడకన శ్రీశైలం వెళ్లారు. జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, ఆయన ముఖ్యమంత్రిగా మళ్లీ పదవి చేపట్టాక మరొకసారి మల్లన్న దర్శనానికి వస్తామని వారు చెప్పారు. జగనన్నకు మద్దతుగానే ఈ పాదయాత్ర చేసి శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామిని దర్శించుకున్నామన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ శిరీష

పోరుమామిళ్ల : ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని తహసీల్దార్ శిరీష, మండల విద్యాశాఖ అధికారి కాశయ్య సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, చదువు పట్ల అంకితభావం ఉన్నపుడే ఉన్నత స్థానాలు సాధించగలరని అన్నారు. ఆదివారం వెంగమాంబ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు, పాఠశాల 20వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకులు పుల్లపనాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో కవి బొల్లు రామ్మోహన్, అగ్నిమాపక అధికారి నజీర్ అహమ్మద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగలింగారెడ్డి, కరస్పాండెంట్ గుర్రం దిలీప్‌కుమార్ మాట్లాడుతూ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించేందుకు కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- విజయవంతమైన పల్స్ పోలియో



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



చాపాడులో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్

ప్రొద్దుటూరు క్రైం : ఐదేళ్లలోపు చిన్నారుల నిండు జీవితానికి పోలియో చుక్కలు తప్పనిసరి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శ్రీరాములపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. దేశంలోని చిన్నారులందరికీ ఒకే రోజు పోలియో చుక్కలు వేస్తున్నారని తెలిపారు. శ్రీరాములపేటలోని పూర్ణ కోచింగ్ సెంటర్ వద్ద ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, శ్రీరాములపేట ఆస్పత్రిలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి, పాత బస్టాండ్‌లో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ శౌభూషణ్‌రెడ్డి, మున్సిపల్ ఆఫీసు వద్ద కమిషనర్ రఘురామిరెడ్డి, పవర్‌హౌస్ రోడ్డు సెంటర్‌లో అర్బన్ వైద్యాధికారి ఐశయారాణి, డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, ఉర్దూ హైస్కూల్‌లో డాక్టర్ నజీర్‌బాషా, వార్డుల్లో కౌన్సిలర్లు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ వైద్యాధికారులు ఆలీమ్, పూజిత, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈఓ వెంకటరత్నం, రూట్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కామనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో

కామనూరు పీహెచ్‌సీ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి హనీఫ్‌బాబా తెలిపారు. 5,347 మందికి గాను 5,239 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామన్నారు. డీపీఎంఓ డాక్టర్ శౌభూషన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, సీహెచ్‌ఓ కృష్ణమ్మ, సూపర్ వైజర్లు బీపీ వరప్రసాద్, చంద్రకళ, రూట్ సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్, శ్రీనివాస్, సుబ్బయ్య పాల్గొన్నారు.

రెండు చుక్కలతో సంపూర్ణ జీవితం

చాపాడు : రెండు చుక్కల పోలియో మందు చిన్న పిల్లలకు వేయించడం ద్వారా వైకల్యంలేని సంపూర్ణ జీవితం పొందుతారని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. మండల కేంద్రం చాపాడులోని ఆరోగ్య ఉప కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని రఘురామిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఎమ్మెల్యే పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు క్రమం తప్పకుండా తమ పిల్లలకు పోలియో చుక్కలు ఇప్పించాలని సూచించారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని వారికి సోమ, మంగళవారాల్లో వేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తెలిదేల లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, జమాల్, వాసు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్, వైద్యాధికారులు కావ్య మాధురి, ఓబులేసు, సూపర్‌వైజర్ సరస్వతి, ఏఎన్‌ఎం స్రవంతి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలియో చుక్క జీవితానికి రక్ష

పోరుమామిళ్ల : చిన్న పిల్లలకు పోలియో చుక్క వారి జీవితానికే రక్ష అని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక 50 పడకల ఆస్పత్రిలో ఎమ్మెల్సీ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో వాక్సిన్ వినియోగంలోకి రాకముందు ఎందరో అంగవైకల్యంతో జీవితాంతం బాధపడేవారని, ఈనాడు దేశం పోలియో రహిత దేశంగా ప్రపంచానికే ఆదర్శంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత డీసీ ఆదిత్యారెడ్డి, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైఎస్ ఎంపీపీ సీఎం బాష, సర్పంచ్ రమణారెడ్డి, డాక్టర్ మార్కారెడ్డి, జిల్లా అదనపు వైద్యఆరోగ్య అధికారి డాక్టర్ రవిబాబు, మెడికల్ ఆఫీసర్లు మేరీ ఎల్సా, శ్రీవిద్య, కరిష్మా, నాగేంద్రబాబు, ఆరోగ్య విద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పల్స్ పోలియో విజయవంతం

మైదుకూరు : మైదుకూరు మండలంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైంది. మండలంలో 0–5 ఏళ్లలోపు పిల్లలు 6,908 మంది ఉండగా 6,701 మందికి పోలియో చుక్కలు వేసి 97శాతం పూర్తి చేశారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో ఇంటింటికి వెళ్లి వద్య సిబ్బంది పోలియో చుక్కలు వేయనున్నారు. మండలంలో మైదుకూరు, వనిపెంట, జీవీ సత్రం, జోసెఫ్‌పేట, కృష్ణాపురం రూట్లలో వైద్యాధికారులు జేబీ శ్రీకాంత్, శ్రీనాథ్‌రెడ్డి, సుమధుర, అయిషా, సుధా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించగా, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మల్లేష్ పరిశీలించారు.

ఖాజీపేటలో మండలంలో..

ఖాజీపేట : మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. ఆరోగ్య కేంద్రం పరిధిలోని 77 బూత్‌ల్లో 5,663 మంది పిల్లలకు గాను 5,530 మందికి చుక్కల మందులు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ ముబీన్ తెలిపారు. చుక్కల మందు పిల్లలకు వేయించడం వల్ల అంగవైకల్యం రాకుండా నివారించవచ్చురని తెలిపారు.

వంద శాతం పూర్తి చేస్తాం

కలసపాడు : మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులకు ఆదివారం పల్స్‌పోలియో వేసినట్లు వైద్యాధికారి డాక్టర్ శైలజ తెలిపారు. మండలంలో 3,470 మంది చిన్నారులు ఉండగా 3,431 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు. మండలంలో 40 బూత్‌లు ఏర్పాటు చేసి నలుగురు సూపర్‌వైజర్లు, ఒక మొబైల్ టీంను పర్యవేక్షణకు ఏర్పాటు చేశామన్నారు. ఈరోజు పోలియో చుక్కలు వేయని చిన్నారులకు సోమ, మంగళవారాల్లో పోలియో చుక్కలు వేసి వంద శాతం పూర్తి చేస్తామని తెలిపారు.

తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

దువ్వూరు : మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి 5 ఏళ్ల పిల్లలకు పోలియో చుక్కలను తప్పనిసరిగా వేయాలని సిబ్బందిని ఆదేశించారు. మండలంలో 54 పోలియో బూత్‌ల ద్వారా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. మండలంలోని చిన్న పిల్లలు 5,788 మంది ఉండగా 5,564 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశామన్నారు.

కాశినాయన మండలంలో..

కాశినాయన : మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో విజయవంతమైందని వైద్యాధికారి డాక్టర్ ప్రశాంతి తెలిపారు. మండలంలో 36 బూత్‌లు ఏర్పాటు చేశామని, 3,352 మంది పిల్లలకు పల్స్‌పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా 3,211 మందికి పోలియో చుక్కలు వేశామన్నారు. మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో ప్రతి ఇంటికి వెళ్ళి పోలియో చుక్కలు వేస్తామని తెలిపారు.

98 శాతం నమోదు

గోపవరం : గోపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో 98.16 శాతం నమోదైనట్లు మండల వైద్యాధికారి డాక్టర్ మహేశ్వరరెడ్డి తెలిపారు. 0–5 సంవత్సరాల లోపు 5,948 మంది చిన్నారులకు గాను 5,839 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసి 98.16 శాతం సాధించినట్లు తెలిపారు. మిగిలిన 2 శాతం చిన్నారులకు సోమ, మంగళవారాల్లో ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తామన్నారు.

97.5 శాతం నమోదు

అట్లూరు : మండల పరిధిలోని పల్స్ పోలియో కార్యక్రమం 97.5 శాతం పూర్తి చేసినట్లు స్థానిక వైద్యాధికారులు డాక్టర్ కె.హమీదబేగం, డాక్టర్ ఎస్.మాధురి పేర్కొన్నారు. మండల పరిధిలోని 0–5 సంవత్సరాల లోపు 2,687 మంది చిన్నారులు ఉండగా 2,609 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశామని తెలిపారు.

రాజుపాళెం మండలంలో..

రాజుపాళెం : రాజుపాళెం మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం 97 శాతం నమోదైనట్లు వైద్యులు మంజుల, నిఖిల పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు పిల్లలు 3,429 ఉండగా 3,325 మందికి పోలియో చుక్కలు వేసి 97 శాతం నమోదు చేశామన్నారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం

బద్వేలు అర్బన్: పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దామని వైద్యాధికారులు వైద్యులు జోత్స్న, స్వర్ణలత, వినయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం మున్సిపాలిటీ, మండల పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు పోలియో చుక్కలు తప్పకుండా వేయించాలని, ఎలాంటి అపోహలకు గురి కావద్దని సూచించారు. క్రమం తప్పకుండా పోలియో చుక్కలు వేయించడం వలన పిల్లల ఆరోగ్య భవిష్యత్తుకు రక్షణగా ఉంటుందని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న రమేష్ యాదవ్, శెట్టిపల్లె నాగిరెడ్డి

దువ్వూరు : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, నియోజకవర్గ సమన్వయ కర్త శెట్టిపల్లె నాగిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మనేరాంపల్లె గ్రామంలో గ్రామస్తులతో ముఖాముఖి నిర్వహించి.. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా తాగు నీటిని అందించాలని గ్రామ సర్పంచ్ హరినాథరెడ్డికి సూచించారు. గ్రామంలో ఆర్‌ఓ ప్లాంట్ లేదని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. స్పందించిన వారు అధికారులతో మాట్లాడి త్వరలో ఆర్‌ఓ ప్లాంట్ మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి వాటి ద్వారా కోట్లాది రూపాయలు ఖాతాల్లో వేసిందన్నారు. మనస్ఫూర్తిగా సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు, చాపాడు ఎంపీపీలు జయచంద్రారెడ్డి, లక్షుమయ్య, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కానాల ఓబుళరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లబోయిన గంగాధర్ యాదవ్, పెద్దబోగాది, సుబ్బకృష్ణ, గంగాధర్, హరికృష్ణ, సంగన లక్ష్మిరెడ్డి, ఇరగంరెడ్డి పద్మనాభరెడ్డి, సానేపల్లి కిరణ్‌కుమార్‌రెడ్డి, గుడిపాడు సర్పంచ్ మాబుషరీఫ్ పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి



మాట్లాడుతూ రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి

చాపాడు : అల్లాడుపల్లె శ్రీ వీరభద్ర స్వామి ఆలయంలో ఈ నెల 9, 10వ తేదీల్లో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు రూరల్ సీఐ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థానం ప్రాంగణంలో ఆదివారం మహాశివరాత్రి ఉత్సవాల నిర్వహణపై ఆలయ చైర్మన్ వైవీ వెంకట సుబ్బారెడ్డి (ఉదయ్), ఈఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ శివరాత్రి పండుగను పురస్కరించుకుని వేలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులకు సౌకర్యంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోట చేసుకోకుండా పోలీసుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఉత్సవాల్లో నిర్వాహకులు, వలంటీర్లు తమ ఐడీ కార్డులను తీసుకోవాలన్నారు. భక్తుల కోసం బారికేడ్లు, వీఐపీ, గ్యాలరీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఆర్‌వీ కొండారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా రెండోరోజు బ్రహ్మోత్సవాలు

అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి ఆలయంలో ఆదివారం రెండో రోజు బ్రహ్మోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని భూతవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో ఆలయ వేద పండితుడు నరేంద్ర శర్మ, అర్చకులు భరత్ శర్మ, గోవింద స్వామి, ప్రసాద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గెలుపులో యువత పాత్ర కీలకం కావాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిత్యరెడ్డి

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ గెలుపులో యువత పాత్ర కీలకం కావాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి యువజన విభాగం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.33 లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి చరిత్ర సృష్టించారన్నారు. విద్యార్థులు, యువతలో నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంపొందించేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చి జాబ్ మేళాల ద్వారా లక్షలాది ఉద్యోగాలు కల్పించారని తెలిపారు. బద్వేలు నియోజకవర్గంలో సెంచురీ పానెల్స్ పరిశ్రమను ఏర్పాటు చేసి 2 వేలకు పైగా ఉద్యోగాలు స్థానిక యువతకు కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు సుధాకర్‌రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, శివ, హరికృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నరసారెడ్డి, రాము, రవికుమార్ పాల్గొన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బయనపల్లె గ్రామానికి చెందిన భూమిరెడ్డి వెంకటరమణారెడ్డికి మంజూరైన రూ.50 వేల చెక్కును ఆదివారం బయనపల్లె గ్రామంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక లోటులో ఉన్నప్పటికీ ప్రజలు ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి సహాయం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ వేణుయాదవ్, ఉప సర్పంచ్ రవికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణ రాయబారం హరికథ కాలక్షేపం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో హరికథ సప్తాహం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఒంగోలుకు చెందిన ఆల్ ఇండియా రేడియో, టీవీ కళాకారిణి వేదవతి భాగవతారిణి చే శ్రీకృష్ణరాయబారం హరికథ ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హరికథను ఆలకించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, అన్నమయ్య కళాపీఠం అధ్యక్షుడు యడవల్లి రమణయ్య భాగవతార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలవండి

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలుకుతున్న నాయకులు

బద్వేలు అర్బన్ : పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేస్తున్న సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులోని సుమిత్రానగర్, మేదరవీధి, ఎస్టీకాలనీల్లో ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేదని, నేడు అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయని తెలిపారు. విద్య, వైద్య రంగాలతో పాటు మహిళా సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. అధికారం కోసం కల్లబొల్లి మాటలు చెబుతున్న టీడీపీ, జనసేన నాయకుల హామీలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సుబ్బారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు గోపాలస్వామి, సాయికృష్ణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు పోలిరెడ్డి, యద్దారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు ఓబుల్‌రెడ్డి, దుద్దుకూరు సత్యం, గురివిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, శివయ్య, బిజ్జం రమణ, రమేష్‌బాబు, నారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, మౌలాలి, సాంబశివారెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింగమాల వెంకటేశ్వర్లు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

పోరుమామిళ్ల : సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, దేశానికి ఉత్తమ పౌరులను అందించే బాధ్యత వారిదేనని ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, నియోజకవర్గ అదనపు సమన్వయకర్త ఎన్.విశ్వనాథరెడ్డి, జిల్లా సమగ్రశిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పోరుమామిళ్ల మండల విద్యాశాఖ అధికారిగా, టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పని చేసి పదవీ విరమణ చేసిన పి. రత్నస్వామి సన్మానసభలో వారు మాట్లాడారు. రత్నస్వామి 42 సంవత్సరాలు విద్యారంగానికి చేసిన సేవలు ప్రశంసనీయమన్నారు. సన్మానసభలో పోరుమామిళ్ల, కలసపాడు మండలాల జెడ్పీటీసీలు ముత్యాల ప్రసాద్, అంకన గురివిరెడ్డి, ఆప్కాస్ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, వైస్ ఎంపీపీలు సీఎం బాష, చెన్ను రాజశేఖర్, ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి. రమణారెడ్డి, జిల్లా, మండల విద్యాశాఖ అధికారులు, వివిధ ఉపాధ్యాయ యూనియన్ నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు గోపవరంలో ఇంటింటి ప్రచారం

గోపవరం : వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం సోమవారం మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోపవరం మల్లికార్జునరెడ్డి తెలిపారు. ప్రచారంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, యువ నాయకులు ఆదిత్యరెడ్డి పాల్గొంటారని తెలిపారు. భూమిరెడ్డిపల్లె, సంగసముద్రం, చిన్నగోపవరం గ్రామాల్లో ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు, డైరెక్టర్లు, చైర్మన్‌లు, బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

మొల్ల జయంతిని జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు

గోపవరం : కవయిత్రి మొల్లమాంబ సప్త శతాబ్ది సాహితీ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సాహితీపీఠం ఆహ్వానం పలికింది. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంటహనుమంతరావు, ప్రధాన కార్యదర్శి జి.వి. మనోజ్‌కుమార్ మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన ప్రారంభమయ్యే సాహితీ కార్యక్రమాలు వివిధ ప్రదేశాల్లో నిర్వహించి 14వ తేదీ విజయోత్సవంతో ముగుస్తాయన్నారు.

పురస్కార గ్రహీతలు వీరే

మొల్ల జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రముఖ రంగస్థల కళాకారుడు ఎస్.నాగముని, సాహితీవేత్త నాగేంద్రమ్మ, జింకా సుబ్రమణ్యం, లోకా జగన్నాథ శాస్త్రి, పసుపులేటి శంకర్‌కు మొల్ల సాహితీ సేవా కళా పురస్కారాలతో పాటు నగదు పారితోషికం, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలతో సత్కరించనున్నట్లు వారు తెలిపారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు లక్ష్మణ్, సుబ్బరాయుడు, శివ పాల్గొన్నారు.

టీడీపీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా ఉంది

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ఎన్నికల ప్రచారం చేస్తున్న రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో టీడీపీ పరిస్థితి కుక్కలు చింపిన విస్తరిలా తయారైందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎద్దేవాచేశారు. ఆదివారం మున్సిపాలిటీలోని 18వ వార్డులో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ఎన్నికల ప్రచారం చేశారు. 18వ వార్డు కౌన్సిలర్ వెల్లాల మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో టీడీపీకి సంబంధించి నాలుగు గ్రూపులు ఉన్నాయని విమర్శించారు. టీడీపీ, బీజేపీ పొత్తు కుదిరితే ప్రొద్దుటూరు అసెంబ్లీ టికెట్‌ను బీజేపీ నాయకుడు ఆదినారాయణరెడ్డి ఇచ్చే అవకాశం ఉందని ప్రజల్లో ప్రచారం కొనసాగుతోందన్నారు. 2019 ఎన్నికల్లో సొంత నియోజకవర్గం జమ్మలమడుగులోనే ఓటమి పాలైన ఆదినారాయణరెడ్డి ప్రొద్దుటూరులో ఎలా గెలుస్తారని ప్రశ్నించారు. మరోమారు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేస్తామని ప్రకటించారు. గడిచిన ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం ప్రొద్దుటూరు అభివృద్ధికి కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, మాజీ కౌన్సిలర్ పాతకోట కృష్ణవేణి, రాచమల్లు రాఘవేంద్రారెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాం రెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శారద, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ స్టోర్స్ అధ్యక్షురాలు కళావతి, కొండా ధనలక్ష్మి, గుమ్మళ్ల పద్మావతి, దేవి, పార్వతి, శ్రీతులసి, కౌన్సిలర్లు గరిశపాటి లక్ష్మీదేవి, జిలాన్, ఆకాశవాణి మాజీ డైరెక్టర్ విజయసారథి, రమాదేవి, న్యాయవాది సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శులు పోరెడ్డి నరసింహారెడ్డి, లక్కిరెడ్డి పవన్‌రెడ్డి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ కాకర్ల నాగేశ్వార రెడ్డి, బండారు సూర్యనారాయణ, ఎస్ఎండీ ఇలియాస్, ఏపీ రజక సంఘం అధ్యక్షుడు కాశయ్య, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు మారుతిప్రసాద్, కంభం వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు 19వ వార్డులో ప్రచారం

మున్సిపాలిటీ పరిధిలోని 19వ వార్డు వెదుర్లబజార్‌లోని వినాయక గుడి వద్ద నుంచి సోమవారం ఉదయం 7 గంటలకు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో రాచమల్లు శివప్రసాదరెడ్డి దంపతులు పాల్గొంటారని పేర్కొన్నారు.

మేలు జరిగింటేనే ఓటేయండి

రాజుపాళెం : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మేలు జరిగింటేనే ఓటేయండని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి సోదరుడు రాచమల్లు కిరణ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం సాయంత్రం మండలంలోని వాసుదేవపురం గ్రామంలో సర్పంచ్ బండి ఉమహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆయన కుమారుడు రాచమల్లు రాఘవేంద్రారెడ్డి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ఓటర్లను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో మారుమూల గ్రామాలు సైతం ఎంతో అభివృద్ధి చెందాయని తెలిపారు. గతంలో గ్రామ పంచాయతీల వద్ద పింఛన్లు పంపిణీ చేసేవారని, ఇప్పుడు ఒకటో తేదీ రాగానే తెల్లవారక ముందు పింఛన్లను వలంటీర్లు లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఈగలపాటి శివ, బండి కొండారెడ్డి, బండి శ్రీనివాసులురెడ్డి, మోహన్, పుల్లారెడ్డి, బీటీ మల్లారెడ్డి, నారాయణరెడ్డి, రామిరెడ్డి, ఓబుళరెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, శేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.